# ధనవంతులకే 'ఇందిరమ్మ'...పేదోడికి మొండిచేయి

- కార్యదర్శుల సర్వేలు బుట్టదాఖలు.. గదుల్లోనే లబ్ధిదారుల జాబితాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు,వారి కొడుకులకు 'గూడు'.. ఐటీ కట్టే వారికే 'ఇందిరమ్మ తోడు
- ఒకే ఇంట్లో రెండు రెండు ఇళ్లు..పేదవాడి కళ్లల్లో కన్నీళ్లు..



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ సామాజిక న్యాయాన్ని వెక్కిరిస్తోంది. 'ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు' అనే ప్రభుత్వ నినాదాన్ని అధికారులు అటకెక్కించారు.క్షేత్రస్థాయిలో గుడిసెల్లో ముగ్గుతున్న అట్టడుగు వర్గాల వారిని పక్కనబెట్టి,ఇప్పటికే అన్ని వసతులున్న ధనవంతులకు,ప్రభుత్వ జీతాలు పొందే వారికి ఈ ఇళ్లను కట్టబెట్టడంపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

### సర్వేలు 'సైడ్'..రికార్డులు 'గైడ్'

ఈ పథకం కోసం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు,క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతో కష్టపడి సర్వేలు నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి ఎవరు అర్హులు,ఎవరికి ఇల్లు అవసరమనే నివేదికలను సిద్ధం చేసి పై అధికారులకు పంపారు.కానీ క్షేత్రస్థాయిలో జరిగిన ఈ సర్వేలు ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు.కార్యదర్శులు పంపిన నివేదికలను పక్కనబెట్టి,అధికారులు తమ గదుల్లో కూర్చుని రాజకీయ నాయకులు పంపిన 'చిట్టీల' ఆధారంగా కొత్త జాబితాలు సిద్ధం చేస్తున్నారు.కింది స్థాయి సిబ్బంది కష్టాన్ని గుర్తించకుండా,కేవలం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అర్హులను పక్కనబెట్టడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

### ఒకే ఇంట్లో రెండు..

నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించాలి.కానీ జిల్లాలో చోటుచేసుకుంటున్న ఎంపికలు చూస్తుంటే నిబంధనలు కేవలం పేదవాడికే వర్తిస్తాయని అర్థమవుతోంది.ఇప్పటికే రెండు ఇళ్లు ఉన్నవారికి,ఆర్థికంగా అత్యంత బలంగా ఉన్నవారికి మళ్లీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం ఏ రకమైన విచారణకు నిదర్శనం?ప్రభుత్వ ఉద్యోగులు,వారి కుమారులకు కూడా ఇళ్లను మంజూరు చేస్తే అధికారులు తమ విధేయతను రాజకీయ నాయకులకు చాటుకుంటున్నారు.లక్షల ఆదాయంతో ఆదాయపు పను() కట్టే స్థోమత ఉన్న వారికి పేదల గూడును అప్పగించడం సిగ్గుచేటు.

### ఎల్2,ఎల్3.. పేదవాడిని చంపే ఉచ్చు..

అర్హత ఉన్న నిరుపేదలు దరఖాస్తు చేసుకుంటే వారికి ఎల్2,ఎల్ 3,(లెవల్ 2,3)వెరిఫికేషన్ల పేరుతో అధికారులు చుక్కలు చూపిస్తున్నారు.''ఫైల్ పెండింగ్‌లో ఉంది.సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కావాలి'' అంటూ నెలల తరబడి కాలయాపన చేస్తూ పేదవాడికి మొండిచేయి చూపుతున్నారు.ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి' కేవలం ఒక తంతుగా మిగిలిపోయింది.సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య వెళ్లినా పరిష్కారం కాకపోవడం చేస్తుంటే,అధికారులు కలెక్టర్ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారా?అన్న అనుమానం కలుగుతోంది.

### వార్తలు రాస్తే నోటీసులతో నోరు నొక్కుతారా?

వ్యవస్థలోని లోపాలను,అధికారుల అవినీతిని ఎండగడుతున్న జర్నలిస్టులపై అధికారులు బెదిరింపులకు దిగడం గమనార్హం.వాస్తవాలు రాస్తే..''మేము ఇచ్చే సమాచారం చెల్లదు, పోయి కలెక్టర్ ని అడుగు'' అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారు.అంతేకాకుండా, నోటీసులతో బెదిరింపులకు దిగుతూ జర్నలిస్టుల నోరు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు నిజం రాస్తే నోటీసులు ఇస్తారా?లేక మీ అక్రమాలు బయటపడతాయని భయపడుతున్నారా? అని జర్నలిస్టు లోకం సూటిగా ప్రశ్నిస్తోంది.

## అక్రమ ఇసుక రవాణాపై చర్యలు

జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / రెబ్బన :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టేందుకు జిల్లా కలెక్టర్ కె హరిత బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రెబ్బన మండల రాంపూర్ శివారులో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆమె స్వయంగా అడ్డుకొని సీజ్ చేయించారు. కాగజ్ నగర్ పెద్దవాగు నుండి ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన కలెక్టర్ వాటిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమార్కుల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని వాగులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఎటువంటి ఉపేక్ష చూపకూడదని ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.రెబ్బన మండల రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం

జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈ నెల 6వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పిప్రి గ్రామంలో పర్యటించి, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, బహిరంగ సభా స్థలిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలల్లో జిల్లాలో జరిగిన కార్యక్రమాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సీఎం సభకు సుమారు 30వేల నుండి 50వేల మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను ముందుగానే గుర్తించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ సిఓ యువరాజ్ మర్మాట్, ఎస్పీ జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం / రెబ్బన :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, విద్యుత్ సవరణ బిల్లు 2022ను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండల కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో లేబర్ కోడ్లు, విద్యుత్ బిల్లు ప్రతులను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ నల్ల చట్టాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సంఘం మండల అధ్యక్షుడు రమేష్, రత్నం దేవాజి, నాయకులు ప్రవీణ్, దుర్గాజి, నర్సయ్య, లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పిఎస్‌కు బారికేడ్ల వితరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జిల్లా ట్రాఫిక్ పిఎస్‌కు బారికేడ్లను, హోర్డింగ్‌లను వితరణ చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా వీటిని లాంఛనంగా అందజేశారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికల లింగ నిష్పత్తిని పెంచేందుకు ప్రజలలో అవగాహన పెంపొందించేలా బారికేడ్లు, హోర్డింగ్‌లు అందజేయటం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర మహిళా సాధికారత విభాగం వారిని ప్రశంసించారు. వీటిని నగరంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఇవి ఉపకరించటంతో పాటు మహిళా సాధికారతతో ప్రజల్లో అవగాహన పెంపొందేందుకు దోహదపడుతాయని కలెక్టర్ అన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని పద్మ అనిల్, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త స్వప్న పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ బలోపేతానికి కృషి

బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్

**ప్రజాపక్షం / గజ్వేల్:** గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్, నూతన పాలకవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాదుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు నూతన కార్యవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా అధ్యక్షులు కిరణ్ సాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాద మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, బార్ అసోసియేషన్ గౌరవాన్ని మరింత పెంచడానికి, అసోసియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. న్యాయవాదుల సమిష్టి కృషితో, న్యాయవాదుల సంక్షేమానికి ముందుంటామని, కోర్టులో త్వరితగతిన న్యాయం చేకూరే విధంగా సమన్వయంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరేష్ చారి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, సహాయ కార్యదర్శి ఉమారాణి, కోశాధికారి అశోక్, క్రీడలు మరియు లైబ్రరీ అబ్దుల్ గఫార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, పరమేశ్వర్, అనూష, అంజలి పాల్గొన్నారు.

## కార్మికులకు ఉరితాళ్ళుగా లేబర్ కోడ్‌లు

కార్మిక సంఘాల ఆగ్రహం

ఏప్రిల్ 1 బ్లాక్ డే గా ప్రకటన



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కో డ్‌లు కార్మికుల పాలిట ఉరితాళ్ళుగా మారాయని, కార్మిక సంఘాలు పోరాడి సాధించిన 29 లేబర్ చట్టాలను రద్దుచేసి మోడీ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. బుదవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల జేఏసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్న ఏప్రిల్ 1ని బ్లాక్‌డేగా జరపాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసి పిలుపుమేరకు ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు సంఘాల ఆద్వర్యంలో ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏప్రిల్ 1, 2026 నుండి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని 2025 నవంబర్ 21న నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. ఈ కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ కంపెనీ యాజమాన్యాల అనుకూల నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 1వ తేదీని బ్లాక్‌డేగా నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసి పిలుపునిచ్చిందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాలని రాష్ట్ర కార్మిక సంఘాల జేఏసి పిలుపునిచ్చాయి. కార్మికులకు ఉరితాళ్ళుగా మారబోతున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. టి యుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం. నరేందర్, ఐఎఫ్‌టి యు జిల్లా అధ్యక్షులు భూ మయ్య, వివిద కార్మిక సంఘాల నాయకులు వెంకన్న, రాజేశ్వర్, మల్లికార్జున్, హన్మాండ్లు, చక్రపాణి, కవిత, అంజయ్య, రామ్ సింగ్, కిరణ్, రవి, గంగాధర్, భారతి, విఠల్ శాంతికుమార్, విజయ్ కుమార్, స్వరూప, భానుచందర్, మహేశ్, గోవర్దన్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో నిరుపేదల్లో ఆనందోత్సావం

మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్

**ప్రజాపక్షం/ముధోల్ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో నిరుపేదల జీవితాల్లో ఆనందోత్సాహం కలుగుతోందని నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ స్పష్టం చేశారు.బుధవారం మండలంలోని వెంకటాపూర్,ఎడ్బిడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పేదల కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అది ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు.ఎలాంటి ఆలస్యం కాకుండా బిల్లులు త్వరితగతిన లబ్దిదారుల ఖాతాల్లో జమచేసి ఇచ్చిన హామీ ప్రకారం గూడలేని నిరుపేదలకు కొన్ని దశాబ్దాలు నిశ్చింతగా ఉండేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలను మంజూరు చేయించారు.పైలెటవ ప్రాజెక్ట్ లో భాగంగా మొదటి విడతలో వెంకటాపూరవ గ్రామానికి మండలంలో అన్ని గ్రామాల కంటే 62 ఇళ్లను మంజూరు చేయించామని వివరించారు. గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ప్రభు త్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించాలని ఆదేశించారు. ముందుగా అంబేద్కారవ విగ్రహానికి పూలమాల వేసి వెంకటాపూర్ గ్రామంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బౌద్ధవిహార్ ప్రాం గణం అంతా సీసీ ఫ్లోరింగ్ చేయించారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే,మండల సీనియర్ నాయకులు కిషన్ పటేల్,ప్రేమ్‌నాథ్ రెడ్డి,ముత్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం / జన్నారం :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మంజూరైన ఐదు పవర్ టిల్లర్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి రైతు పక్షపాతిగా నిలిచిందని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఒక్కో యూనిట్ విలువ రూ.2,43,000 ఉండగా ప్రభుత్వం రూ.1,20,000 సబ్సిడీ అందిస్తోందని వెల్లడించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేస్తూ అధిక లాభాలు గడించవచ్చని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కోట శంకర్, కొండపర్తి అంజవ్వ, దుర్గం రాజు, సంతపురి ఇందురు, కోట కిషన్ పవర్ టిల్లర్లను అందుకున్నారు.

## యాప్ ద్వారా ఇసుకకు దరఖాస్తు

**ప్రజాపక్షం/కౌల్చారం:** ఇసుక అవసరం ఉన్న వారు మన ఇసుక వాహనం యాప్ ద్వారా ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవాలని కౌల్చారం తాసిల్దార్ శ్రీనివాసచారి అన్నారు. మెదక్ జిల్లాలోని కౌల్చారం తహసిల్దార్ బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇసుక వాహనం యాప్ గురించి వివరించారు. ప్లే స్టోర్ నుండి టీజీఎమ్ఐవి మన ఇసుక వాహనం యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ట్రాక్టర్ ఇసుకకు రూ. 612 చెల్లించాలని, , ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజల ఇతర సొంత అవసరాలకు ట్రాక్టర్కు రూ. 1173 రూపాయలు ఆన్లైన్లో చెల్లించాలని తహసిల్దార్ సూచించారు. కౌల్చారం మండలంలో కొంగోడు, పైతర, తుక్కాపూర్,ఏటిగడ్డ మాందాపూర్‌లో ఇసుక రీచ్ గుర్తించినట్లు తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసినదరఖాస్తుదారులు తమ సొంత ట్రాక్టర్లలో లేదా అద్దె ట్రాక్టర్లలో తాసిల్దార్ సూచించిన ఇసుక రీచ్ నుండి ఇసుక తీసుకెళ్లడానికి అనుమతులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

## ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నిర్మల్/ఖానాపూర్ :** ఈనెల నాలుగవ తేదీన (శనివారం) ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన,ఖానాపూర్ మునిసిపల్ కార్యాలయంలో,మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికను ప్ర శాంతంగా పారదర్శకంగా నిర్వహించాలని అ న్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటి ంగ్ ఏర్పాటు చేసి,త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు.తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్,పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా భాధ్యతలు చేపట్టి,తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందుకు అదనపు కలెక్టర్‌ను మున్సిపల్ కమిషనర్,తదితర అధికారులు శాలువాతో సన్మానించారు.సీపీవో జీవరత్నం,మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,తహసిల్దార్ సుజాత,ఎంపీడీవో రమాకాంత్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గద్దర్ ఫౌండేషన్ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మెదక్ :** గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హైదరాబాద్ లో జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలపై రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు జెల్లా సుధాకర్, పి శంకర్, హైమద్ లు పిలుపునిచ్చారు. గద్దర్ ఫౌండేషన్ పోస్టర్ ను బుధవారం మెదక్ గుల్షన్ క్లబ్‌లో విడుదల చేశారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కాల్పులు జరిగిన రోజున గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సభను నిర్వహిస్తారని తెలిపారు. ఆ రోజును గద్దర్ పునర్జన్మ దినంగా సైతం పాటిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల నుండి జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాల సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజు, నీరుడి ఇసాక్, కంబాల పోచయ్య, బత్తుల ప్రసాద్ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 21వ తేదీ నుండి గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల ఏప్రేల్ 21వ తేది నుండి జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మండల పరిషత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు జెడ్పీ సీఈఓ జానికి రెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామ సభల ఏర్పాటు పై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యచరణ ప్రణాళికను ప్రజాప్రతినిదులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ సభనలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామ సభ ఉదయం 10 గంటలకు ప్రారంభించాలని ఆదేశించారు. లబ్దిదారుల ఎంపికకు సంబందించిన వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని ప్రతి పథకం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలలో వ్యవసాయ శాఖకు సంబందించిన రైతు భరోసా ,రైతు భీమా ,ఋణమాఫి , దాన్యం కొనుగోలు, యాంత్రీకరణ, పథకాలు అలాగే ఆహార భద్రత కార్డులు రేషన్ కార్డుల ద్వారా ఇంటింటికి సన్నబియ్యం పంపిణి చేయుత ,మహాలక్ష్మి ,గృహజ్యోతి , మహిళా శక్తి ఎస్‌హెచ్ జి ఋణాలు ఉపాది హామి పనులు తదితర ప్రభుత్వ పథకాలపై పూర్తి వివరాల సమాచారం అధికారుల వద్ద సిద్దంగా ఉండాలని ఆదేశించారు. మహిళా రైతులకు రైతు భీమా ,పించన్లు వంటి ఆర్థిక భరోసా , కల్పిస్తున్నారని తెలిపారు. త్వరంలో అమలు కానున్న ప్రభుత్వ కొత్త పథకం ,ఇందిరమ్మ, కుటుంబ భీమా పథకం, అన్ని కుటుంబాలకు వర్తిస్తుందనే విషయాలన్ని తెలియజేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల మద్యాహ్న బోజన పథకం ,ఇందిరమ్మ, కుటుంబ జీవిత బీమా వంటి కొత్త పథకాల వివరాలు కూడా గ్రామ సభలలో వివరించాలన్నారు. యువత స్వచ్చంద సంస్థలు , రైతులు ,మహిళా సంఘాలు తదితరులు గ్రామ సభలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు ,వృద్దుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామ సభల వివరాలను నోటీస్ బోర్డులలో ప్రదర్శించడంతో పాటు దండోరా ,పోస్టర్ల ద్వారా గ్రామ ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ సభలలో లబ్దిదారుల జాబితా తప్పని సరిగా సిద్దంగా ఉండాలని తెలిపారు.

## సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** బుదవారం సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనికి చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సర్కిల్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. వివిధ నేరాలలో సిజ్ చేసిన వాహానాలను క్రమ బద్దంగా ఉండాలని సూచించారు. స్టేషన్ రికార్డులు జనరల్ డైరీ ,హిస్టరీ పేట్లు ,పిటిషన్ రిజిస్టర్‌లను తనిఖీ చేస్తూ అన్ని రికార్డులు తాజా సమాచారం తో ఆప్టేట్‌గా ఉంచాలని అన్నారు. పెండింగ్ ,అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఎస్‌హెచ్‌ఓ కు సూచించారు. రోడ్డు భద్రతాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రోడ్డు నిర్మాణంలో లోపాలను అదిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఎన్‌హెచ్ ఏఐతో చర్చించి మరమ్మతులు చేయాలని అన్నారు. తరచూ వాహానాల తనిఖీలు ,డ్రంక్, అండ్ డ్రైవ్, నాకాబంది, వంటి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అనుమానిత వ్యక్తులు , వాహానాలను తనిఖి చేయాలని సూచించారు.

